జీఎస్టీ తగ్గింపుతో పేదలకు మేలు

కర్నూలు(సెంట్రల్): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంతో పేదలకు మేలు జరుగుతుందని జిల్లా కార్మిక శాఖ సహాయ కమిషనర్ సాంబశివ అన్నారు. బుధవారం రోజా వీధిలో రోజా ఐక్య సంఘం అధ్యక్షురాలు మీసాల సుమలత ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ..సూపర్ సేవింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన పేదలకు దసరా కానుక కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేశన్న, హేమాద్రి పాల్గొన్నారు.

ప్రధాని పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు


రైతుబజారులో జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలను వివరిస్తున్న కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి

కర్నూలు(సెంట్రల్): అక్టోబర్ 16న ప్రధాని నరేంద్రమోదీ జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో ప్రధానమంత్రి పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రధాని నగరంలో 4 వేల మందితో రోడ్ షో నిర్వహించే అవకాశం ఉన్నందున వేదిక, వాహనాల పార్కింగ్, హెలిప్యాడ్ ఏర్పాట్లపై ఆర్‌డీఓ, మునిసిపల్ కమిషనర్, ఆర్అండ్‌బీ ఎస్ఈలు చర్చించుకోవాలన్నారు. నగరంలో సుందరీకరణ, పారిశుద్ధ్య నిర్వహణ, రోడ్ల మరమ్మతులు చేపట్టాలని మునిసిపల్ అధికారుల ను ఆదేశించారు. హెలిప్యాడ్ ఏర్పాటుపై ఆర్అండ్‌బీ అధికారులు, రోడ్ షో నిర్వహణ, పార్కింగ్‌పై పోలీసు, రెవెన్యూ అధికారులు సమన్వయం చేసుకోవాలని చెప్పారు. జేసీ డాక్టర్ బి.నవ్య, డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, మునిసిపల్ కమిషనర్ విశ్వనాథ్, స్పెషల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ చిరంజీవి, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కర్నూలు ఆర్‌డీఓ సందీప్‌కుమార్, ఆర్అండ్‌బీ ఎస్ఈ మహేశ్వరరెడ్డి, డీఎస్పీ బాబు ప్రసాదు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలపై అవగాహన

కర్నూలు(అగ్రికల్చర్): జీఎస్టీ తగ్గింపు వల్ల అనేక వస్తువుల ధరలు తగ్గాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి తెలిపారు. నిత్యావసర సరుకులు, ప్యాకేజ్డ్ ఫుడ్స్, ఆరోగ్య సంబంధిత సామగ్రి, డెయిరీ, బేకరీ ఉత్పత్తులు, స్టేషనరీ, బైక్‌లు, కార్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాల ధరలు తగ్గినట్లు కలెక్టర్ వెల్లడించారు. బుధవారం కర్నూలులోని సి.క్యాంపు రైతుబజారులో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కరపత్రాలను పంపిణీ చేశారు. జీఎస్టీ తగ్గింపు వల్ల వినియోగదారులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. మున్సిపల్ కమీషనర్ విశ్వనాథ్, వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ నీరజ, డీఎస్‌వో రాజా రఘువీర్, రైతుబజారు ఎస్టేటు అధికారి కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

కర్నూలు(సెంట్రల్): ఇళ్ల నిర్మాణాలను నిర్దేశించిన గడువులోపు పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆమె బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండలాల ప్రత్యేకాధికారులు, డివిజన్, మండల స్థాయి అధికారులతో హౌసింగ్‌పై సమీక్షించారు. ఇళ్ల నిర్మాణాల్లో గోనెగొండ్ల, పత్తికొండ, ఆలూరు, ఆదోని, ఓర్వకల్ మండలాలు వెనకబడ్డాయన్నారు. ఆయా మండలాల్లో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కర్నూలు, పత్తికొండ ఆర్‌డీఓలు సందీప్‌కుమార్, భరత్‌నాయక్, హౌసింగ్ పీడీ చిరంజీవి, డ్వామా పీడీ వెంకటరమణయ్య, డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎస్వీ


కలెక్టర్ డాక్టర్ ఏ.సిరికి అభినందనలు తెలుపుతున్న ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు జిల్లా కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన డాక్టర్ ఏ.సిరిని వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన బుధవారం కలెక్టర్‌ను ఆమె కార్యాలయంలో కలిసి బొకేను అందజేసి అభినందనలు తెలిపారు. జిల్లా అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని, తమను కలుపుకొని వెళ్లాలని కోరినట్లు ఆయన వెల్లడించారు.

రేషన్‌షాపుల తనిఖీ


తనిఖీ చేస్తున్న జేసీ డాక్టర్ బి.నవ్య

కర్నూలు(సెంట్రల్): నగరంలోని బుధవారపేటలో ఉన్న 1382073, 1382075 రేషన్ షాపులను జేసీ డాక్టర్ బి.నవ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. వినియోగదారులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. రేషన్ సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని డీలర్లకు సూచించారు. మరోవైపు అక్టోబర్ 15వ తేదీ వరకు డీలర్ల వద్ద, ఆ తరువాత సచివాలయాల వద్ద స్మార్ట్ రేషన్ కార్డులను పొందవచ్చని వినియోగదారులకు సూచించారు.

'కర్నూలు వైభవం' కరదీపిక ఆవిష్కరణ


'కర్నూలు వైభవం' కరదీపికను ఆవిష్కరిస్తున్న ఆర్‌యూ వీసీ, రెక్టార్, తదితరులు

కర్నూలు కల్చరల్: కర్నూలు నగర వైభవం వారోత్సవాలను పురస్కరించుకొని రూపొందించిన 'కర్నూలు వైభవం' కరదీపికను రాయలసీమ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ వి.వెంకట బసవరావు, రెక్టార్ ఆచార్య ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ డాక్టర్ విజయకుమార్ నాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. కర్నూలు ప్రాంతం గొప్ప మేధావులను, స్వాతంత్ర్య సమరయోధులను, మహా దాతలను జాతికి అందించి చరిత్రలో విశిష్టమైన స్థానం సంపాదించుకుందన్నారు. 'కర్నూలు నగరాభివృద్ధి – కార్యాచరణ ప్రణాళిక' అనే అంశంపై జరిగిన వెబినార్‌లో వర్సిటీ రెక్టార్ ఆచార్య ఎన్‌టీకే నాయక్ ప్రసంగించారు. జిల్లా మేధావుల వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు మన్సూర్ రహమాన్ మాట్లాడుతూ.. మొదటి భాషా ప్రయుక్త రాష్ట్రానికి రాజధానిగా కర్నూలు నగరం జాతీయ పటంలో చోటుచేసుకున్న చారిత్రక నేపథ్యానికి గుర్తుగా గత నెల 25 నుంచి బుధవారం వరకు కర్నూలు నగర వైభవ వారోత్సవాలను నిర్వహించామన్నారు. ఇండియన్ నాలెడ్జి సిస్టమ్ సౌజన్యంతో జరిగిన అంతర్జాతీయ వెబినార్‌లో కర్నూలు సాంస్కృతిక, చారిత్రక వైభవం అంశం, రేడియోలో ప్రసారమైన 'చరిత్రలో కర్నూలు నగర వైభవం' అంశంపై మేధావులు ప్రసంగించారన్నారు. ఆంధ్రోద్యమంపై ఆన్‌లైన్‌లో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించామన్నారు.

వృద్ధుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు

కర్నూలు(హాస్పిటల్): అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 1 నుంచి 31వ తేదీ వరకు జిల్లాలోని వృద్ధాశ్రమాల్లో వైద్య శిబిరాలు, ఫిజియోథెరపీ సేవలు అందించనున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ చెప్పారు. ఆమె బుధవారం తన ఛాంబర్‌లో ప్రోగ్రాం అధికారులతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. అలాగే నగరంలోని 'మన' వృద్ధాశ్రమంలో లీగల్ సర్వీస్ యూనిట్ మెంబర్ రాయపాటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వృద్ధులకు న్యాయ విజ్ఞాన శిబిరం, ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కంటి పరీక్షలు చేసి ఉచితంగా కళ్లద్దాలను అందజేశారు.

ఘన సన్మానం


నరసయ్య దంపతులను సత్కరిస్తున్న పట్టు పరిశ్రమ శాఖ అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): పట్టు పరిశ్రమ శాఖలో సాంకేతిక అధికారిగా పనిచేసి సెప్టెంబరు 30న పదవీ విరమణ చేసిన నరసయ్య దంపతులను బుధవారం ఉద్యాన భవన్‌లో అధికారులు ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందచేశారు.

భద్రత ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ


ఏపీఎస్పీ మైదానంలో హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ, అధికారులు

కర్నూలు: ప్రధాని నరేంద్ర మోదీ అక్టోబర్ 16న ఉమ్మడి జిల్లా పర్యటనకు వస్తున్న నేపథ్యంలో బుధవారం సాయంత్రం ఎస్పీ విక్రాంత్ పాటిల్ భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. నంద్యాల జిల్లా శ్రీశైలంలో మల్లన్న దర్శనం అనంతరం కర్నూలు నగరంలో జీఎస్టీ సంస్కరణలపై రోడ్ షోలో పాల్గొననున్నట్లు పోలీసు శాఖకు ప్రాథమికంగా సమాచారం అందింది. ఈ నేపథ్యంలో వాహనాల పార్కింగ్, హెలిప్యాడ్ ఏర్పాటుపై ఏపీఎస్పీ రెండో బెటాలియన్, సిల్వర్‌జూబ్లీ కళాశాల, గవర్నమెంట్ ఫర్ మెన్ కళాశాల, బి.క్యాంప్, నంద్యాల చెక్‌పోస్టు, కృష్ణా నగర్ హైవే, జొహరాపురం రోడ్డుతో పాటు కర్నూలు పాతబస్తీలో ఎస్పీ కలియదిరిగి పరిశీలించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయి అధికారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. అడిషనల్ ఎస్పీలు హుసేన్ పీరా, కృష్ణమోహన్, కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్, సీఐలు తేజమూర్తి, కేశవరెడ్డి, విక్రమసింహ, శేషయ్య, నాగరాజరావు, మన్సూరుద్దీన్, శ్రీధర్, ఆర్ఐలు జావెద్, నారాయణ తదితరులు ఉన్నారు.

విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి, కలెక్టర్

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్, కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి జిల్లా ప్రజలకు వేర్వేరు ప్రకటనల్లో విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని, కుటుంబ సభ్యులతో ఆనందంగా పండుగను జరుపుకోవాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి పండుగ సందర్భంగా రాష్ట్రం, జిల్లా అని రంగాల్లో అభివృద్ధి సాధించాలని, ప్రతి కుటుంబానికి విజయాలు వరించాలని, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు.

ఘనంగా పొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణ

కర్నూలు కల్చరల్: పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్షతో ఏర్పడిన ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం పురస్కరించుకొని బుధవారం మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణ కార్యక్రమం జరిగింది. తెలుగు భాషా వికాస ఉద్యమం ఆధ్వర్యంలో అవోపా చీఫ్ కన్వీనర్ మలిపెద్దు నాగేశ్వరరావు, ఆదిలక్ష్మి దేవి దంపతుల సౌజన్యంతో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆవోపా గౌరవ చైర్మన్ టీజీ వెంకటేష్, తెలుగు భాషా వికాస ఉద్యమం అధ్యక్షుడు కె.చంద్రశేఖర కల్కూర, కార్యదర్శి జేఎస్ఆర్కే శర్మ, టీజీ శివరాజ్, కేవీ సుబ్బారెడ్డి,లక్ష్మీనారాయణ, దండెబోయిన పార్వతీ దేవి తదితరులు పాల్గొన్నారు.

4 నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఈనెల 4వ తేదీన స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, అండర్-17 విభాగంలో ఫుట్‌బాల్, స్కేటింగ్, లాన్ టెన్నిస్, 6వ తేదీ మార్షల్ ఆర్ట్స్, రెజ్లింగ్, రగ్బీ పోటీలు, 7వ తేదీ మోడ్రన్ పెంటాథ్లాన్ పోటీలు అలాగే కర్నూలు వైద్య కళాశాల వెనుక వైపు ఉన్న స్విమ్మింగ్ పూల్‌లో బాలబాలికలకు పోటీలు ఉంటాయని జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి టి.నాగేశ్వరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తప్పనిసరిగా ప్రధానోపాధ్యాయుల నుంచి అనుమతి పత్రం తీసుకురావాలని సూచించారు.

ఘనంగా ఆయుధ పూజ

కర్నూలు(హాస్పిటల్): విజయదశమి పండుగను పురస్కరించుకుని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో బుధవారం పలు విభాగాల్లో ఆయుధ పూజ చేశారు. వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు. సీటీవీఎస్, ఆర్థోపెడిక్, న్యూరోసర్జరీ, కార్డియోథొరాసిక్, అనెస్తీషియా, ఆపరేషన్ థియేటర్స్ వంటి కీలక విభాగాలతో పాటు పలు ఇతర విభాగాల్లోనూ శస్త్రచికిత్స పరికరాలు, ఆధునిక వైద్య యంత్రాలు, ఆపరేషన్ థియేటర్లలో ఉపయోగించే సాధనాలకు పసుపు, కుంకుమ పెట్టి పూలతో అలంకరించి పూజలు చేశారు. సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జ్ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు: ఏపీఎస్పీ కర్నూలు రెండో పటాలం కమాండెంట్ దీపిక పాటిల్ ఆధ్వర్యంలో పటాలంలోని ఆయుధాగారంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలీసులు వినియోగించే తుపాకులు, వాహనాలకు పురోహితుడితో పూజలు జరిపించారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పాల్గొన్నారు. ముందుగా దుర్గాదేవి చిత్రపటానికి పూజలు నిర్వహించి ఎమ్‌టీ పార్కు పక్కనున్న దుర్గా గుడిలో హోమం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పటాలం అడిషనల్ కమాండెంట్ నాగేంద్రరావు, అసిస్టెంట్ కమాండెంట్లు రమణ, రవికిరణ్, డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు పెద్దన్న నాయుడు తదితరులు పాల్గొన్నారు.

దసరా సందడి


మామిడాకులు కొనుగోలు చేస్తూ..


కర్నూలు సి.క్యాంప్ సమీపంలో పూలు, పండ్ల విక్రయాలు


పూజ సామగ్రితో...


నగరంలోని పాతూరులో జమ్మి చెట్టుకు విద్యుద్దీపాలంకరణ

దసరా పండుగను ఘనంగా జరుపుకునేందుకు నగర ప్రజలు సన్నద్ధమయ్యారు. అమ్మవారి పూజకు అవసరమైన సామగ్రి కొనుగోళ్లతో బుధవారం నగరంలో సందడి నెలకొంది. ప్రజలు పెద్దసంఖ్యలో పూలు, పండ్లు, మావిడాకులు, అరటి బోదెలు, జమ్మి పత్రి కొనుగోలు చేయడంతో ఆయా వ్యాపారాలు జోరుగా సాగాయి. - సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థలో హార్టికల్చర్ ఏడీగా పనిచేస్తున్న కె.వి జయలక్ష్మిని నంద్యాల జిల్లా ఏపీఎంఐపీ ఏడీగా బదిలీ చేస్తూ బుధవారం హార్టికల్చర్, సెరికల్చర్ సంచాలకులు కె.శ్రీనివాసులు ఉత్తర్వులు జారీ చేశారు.